ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

సంగారెడ్డి మెదక్

5

జిల్లాల వార్తలు

శుక్రవారం 24 జనవరి 2025



ఆట పాటలతో మహాసభలను
ముందుకు తీసుకువెళ్లాలి

- ప్రజా సమస్యలపై ఉద్యమించింది ఎర్రజెండాయే
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య

7లో

13 కిలోమీటర్లు.. 10 స్టేషన్లు

మియాపూర్–పటాన్‌చెరు మెట్రో రూట్ ఖరారు



పటాన్‌చెరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మెట్రో రైలు పనులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు విస్తరించనున్న 13 కిలోమీటర్ల మార్గంలో స్టేషన్ల వివరాలను హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో అథారిటీ అధికారికంగా ప్రకటించింది. మియాపూర్ నుంచి పటాన్‌చెరు మార్గంలో మొత్తం 10 స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నారు. ప్రస్తుత మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి ప్రారంభమై మియాపూర్ బొల్లారం క్రాస్‌రోడ్డు, ఆల్విన్ కాలనీ క్రాస్‌రోడ్డు, మదీనాగూడ, చందానగర్, బీహెచ్‌ఈఎల్ లింగంపల్లి చౌరస్తా, అశోక్‌నగర్ జ్యోతినగర్, బీరంగూడ కమాన్, రామచంద్రాపురం, ఇక్రీశాట్, పటాన్‌చెరులో స్టేషన్లు నిర్మించనున్నారు. మెట్రో నిర్మాణం పూర్తయితే సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న పటాన్‌చెరు పారిశ్రామికవాడ ప్రజల చిరకాల కల నెరవేరనుంది. శివారు ప్రాంతాల నుంచి మరింత సౌకర్యవంతంగా హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు రవాణా వ్యవస్థ అందుబాటులోకి రానుంది. నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులకు పడుతున్న నియోజకవర్గ ప్రజలకు మెట్రో ద్వారా ఉపశమనం లభించనుంది. వ్యక్తిగత వాహనాల సంఖ్య గణనీయంగా తగ్గడంతో వాయు కాలుష్యం సైతం తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది. సంగారెడ్డి జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి హైదరాబాద్ వచ్చే వారికి నగర ముఖద్వారంలోనే మెట్రో సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. మియాపూర్ పటాన్‌చెరు మెట్రో మార్గం ఏర్పాటుకు రూ.4,107 కోట్లతో అంచనాలు రూపొందించారు. 2030 నాటికి మెట్రో సేవలు పటాన్‌చెరు ప్రాంతానికి అందుబాటులోకి వస్తాయని అంచనావేస్తున్నారు.

పేరు లేకుంటేనే మళ్లీ దరఖాస్తు చేయాలి

- ప్రతీ అర్హుడికి సంక్షేమ పథకాలు అందుతాయి
- కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది
- గ్రామ, వార్డు సభల్లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



వార్డు సభలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డిలోని 23వ వార్డులో సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్న కౌన్సిలర్ కూన వనితసంతోష్

సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి, జనవరి 23: సంక్షేమ పథకాల జాబితాలో పేరు లేకుంటే మళ్లీ దరఖాస్తు చేయాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి సూచించారు. గురువారం ఆమె సంగారెడ్డి పట్టణంలోని 8, 23 వార్డు సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ అర్హుడికి సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. జాబితాలో పేరు లేకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ కూన వనిత సంతోష్, నాయకులు సునీల్, లక్ష్మణ్, భూమేశ్, సురేందర్, సంతోష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజూ అదే తీరు

- గ్రామసభల్లో నిరసన సెగలు
- జాబితాలో అర్హుల పేర్లు లేవంటూ ఆందోళనలు



ఝరాసంగం మండలం జీర్లపల్లి గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

సంగారెడ్డి టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో వరుసగా మూడో రోజూ గ్రామసభల్లో అధికారులకు నిరసన సెగలు తప్పలేదు. సంక్షేమ పథకాల అమలు కోసం నిర్వహిస్తున్న గ్రామ, వార్డుసభలు గురువారం కూడా కొనసాగాయి. ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల కోసం అర్హులైన లబ్ధిదారుల పేర్లు ఎంపిక చేయకపోవడంపై పలు గ్రామాల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ ఆరు గ్యారంటీల్లో ఒకటైన రైతు భరోసా ఎందుకు ఇవ్వడం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీల ఎంపికలో కాంగ్రెస్ కార్యకర్తలకే ప్రాధాన్యత ఇచ్చారంటూ అధికారులతో బీఆర్ఎస్ శ్రేణులు వాగ్వాదానికి దిగాయి. కాంగ్రెస్ శ్రేణులు అధికారులకు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులతో గొడవకు దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాఫీగా జరిగాయి. కోహీర్, జిన్నారం, ఝరాసంగం, హత్నూర తదితర మండలాల్లో గ్రామసభల్లో నిరసనలు, వాగ్వివాదాలు, ఆందోళనలు చోటు చేసుకున్నాయి.

- కోహీర్ మండలం వెంకటపూర్‌లో కెమికల్ పరిశ్రమకు అనుమతులు ఇవ్వకూడదంటూ గ్రామస్తులు అధికారులకు వినతిపత్రాలను అందజేశారు.
- జిన్నారం మండలం మాదారంలో జరిగిన గ్రామసభలో లబ్ధిదారుల ఎంపిక విషయంలో బీఆర్ఎస్-కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వివాదం చోటు చేసుకోగా, ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.
- మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు జీర్లపల్లిలో జరిగిన గ్రామసభల్లో స్పష్టత లేదంటూ గ్రామస్థులు అధికారులను నిలదీశారు. ఏడాది నుంచి రైతు భరోసా, రూ.4 వేల పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఎందుకు అమలు చేయడం లేదంటూ అధికారులపై మండిపడ్డారు.
- హత్నూర మండల కేంద్రంలో జరిగిన గ్రామసభలో లబ్ధిదారుల జాబితాలో అర్హుల పేర్లు లేవని అధికారులపై అసహనాన్ని వ్యక్తం చేయడంతో సభలో గందరగోళం ఏర్పడింది.

మెదక్ జిల్లాలో...

మెదక్ జిల్లాలో గురువారం నిర్వహించిన గ్రామసభలు పలుచోట్ల గందరగోళంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చేపట్టిన ప్రజాపాలన సందర్భంగా ప్రజలు సంక్షేమ పథకాల కోసం చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా అధికారులు జాబితాలు తయారుచేశారు. అందులో తమ పేర్లు లేకపోవడంతో ఆగ్రహావేశాలతో పలుచోట్ల అధికారులతో వాగ్వాదానికి దిగారు. అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నాయని గగ్గోలు పెట్టారు. లిస్టులో పేర్లు లేని లబ్ధిదారులు మరోసారి దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచిస్తున్నప్పటికీ ప్రజలు వినలేదు. ప్రజాపాలన, కులగణన, ఇంటింటి సర్వేలో సమర్పించిన దరఖాస్తుల సంగతేమిటని ప్రశ్నించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ రేగోడ్, అల్లాదుర్గం మండలాల్లో జరిగిన గ్రామ సభల్లో పాల్గొన్నారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు మెదక్‌లో వార్డుసభలో పాల్గొన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి కౌడిపల్లిలో గ్రామసభలో పాల్గొని అధికారుల తీరును విమర్శించారు.

వేలల్లో దరఖాస్తులు

సంగారెడ్డి జిల్లాలో మూడోరోజు నిర్వహించిన గ్రామసభల్లో మొత్తం 31 వేలు దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలియజేశారు. జిల్లాలోని 8 మునిసిపాలిటీల్లో 10,645 దరఖాస్తులు రాగా, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన గ్రామసభల్లో 20,355 దరఖాస్తులు వచ్చాయి. మునిసిపాలిటీల పరిధిలో రేషన్ కార్డుల కోసం 6,614, ఇందిరమ్మ ఇళ్లకు 598, రైతు భరోసాకు 26, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 21 దరఖాస్తులు వచ్చాయి. 162 గ్రామ సభల్లో రేషన్ కార్డుల కోసం 13,949, ఇందిరమ్మ ఇళ్లకు 4,259, రైతు భరోసాకు 383, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 1,446 దరఖాస్తులు అందినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మెదక్ జిల్లావ్యాప్తంగా బుధవారం 21 వార్డు సభలు, 13 గ్రామసభలు నిర్వహించారు. రేషన్ కార్డుల కోసం 11,486, ఇందిరమ్మ ఇల్లకు 7,307, ఆత్మీయ భరోసా 1,497, రైతుభరోసా 64 దరఖాస్తులు వచ్చాయి. గ్రామసభల్లో దరఖాస్తులు ఇవ్వలేని వారుంటే నేరుగా అధికారులను కలిసి అందజేయవచ్చని సూచించారు.



పటాన్‌చెరులో జాతీయరహదారిపై ధర్నా చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఎమ్మెల్యే 'గూడెం'కు నిరసన సెగ

- పట్టించుకోవట్లేదని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల కన్నెర్ర
- ఇటీవలి పర్యటనల్లో భగ్గుమంటున్న వైరం
- బీఆర్ఎస్ కార్యకర్తలకే ప్రాధాన్యమిస్తున్నారని ఆగ్రహం
- జాతీయ రహదారిపై ధర్నా.. క్యాంప్ ఆఫీస్‌పై దాడి



ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నిస్తున్న కార్యకర్తలు

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి సొంత పార్టీ శ్రేణుల నుంచి నిరసనల సెగ తాకుతోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఆయన కాంగ్రెస్‌లో చేరినా మనసంతా బీఆర్ఎస్ నాయకుల మీదనే ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిక కార్యక్రమాల్లోనూ వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని, అధికారుల బదిలీల్లోనూ ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు కన్నెర్ర చేస్తున్నారు. ఇలాగే వ్యవహరిస్తే తిరిగి బీఆర్ఎస్‌లోకి వెళ్లాలని స్పష్టం చేస్తున్నారు. గురువారం వందలాది మంది కార్యకర్తలు నియోజకవర్గ కేంద్రంలో ఆందోళనకు దిగారు. కొందరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి గులాబీ కుర్చీలను ధ్వంసం చేయడంతో వివాదం తారాస్థాయికి చేరింది. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఆందోళన చేసేవారంతా చిల్లరగాళ్లని.. దమ్ముంటే నేరుగా తలపడాలని సవాల్ విసరడం చర్చనీయాంశంగా మారింది.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 23: హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలుపొందిన మహిపాల్‌రెడ్డి ఎన్నికల అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటికే పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్‌లో బలమైన నేతగా ఉన్న కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆయన చేరికను తీవ్రంగా వ్యతిరేకించారు. అధిష్ఠానం నచ్చజెప్పడంతో అప్పటికి మిన్నకుండిపోయారు. పార్టీలో చేరిన కొత్తలో సైలెంట్‌గా ఉన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇటీవల నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనే క్రమంలో సొంత పార్టీ శ్రేణుల నుంచే తిరుగుబాటు మొదలైంది.

ఎమ్మెల్యేపై భగ్గుమంటున్న స్థానిక నేతలు

తమకు సమాచారం లేకుండానే ఎమ్మెల్యే తమ ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని పలు మండలాలు,

మిగతా 6వ పేజీలో..

అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ కార్యాలయాలు

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్
- కార్యాలయాలు, విద్యాసంస్థల నిర్మాణానికి స్థలాల పరిశీలన



అల్లాదుర్గంలో కార్యాలయాలకు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అల్లాదుర్గం/రేగోడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గం మండలంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ చొరవతో పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణాలు, విద్యా సంస్థల సొంత భవనాలకు మోక్షం లభించింది. పలు భవనాల నిర్మాణం కోసం స్థలాలను మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం పరిశీలించారు. మండలకేంద్రానికి సమీపంలో హైవే పక్కన 379 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఎస్‌టీవో (ట్రెజరీ), ఐసీడీఎస్ భవనాలతో పాటు ఫైర్‌స్టేషన్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. అల్లాదుర్గం-చేవెళ్ల రహదారిలోని 491 సర్వే నంబర్‌లో మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులం, ఐటీఐ కాలేజీ భవనాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు, విద్యా సంస్థల్లో చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలతో భవనాలను నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మల్లయ్య ఆర్ఐ శరణప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం ఆయన రేగోడు మండలంలో విస్తృతంగా పర్యటించారు. రేగోడు మండల కేంద్రంతో పాటు టి.లింగంపల్లి, ప్యారారం, తిమ్మాపూరం, సిందోల్, సంగమేశ్వర్ తండాల్లో గ్రామ సభల్లో పాల్గొన్నారు. మర్పల్లిలో ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. పాఠశాలను నూతన భవనంలోకి మార్చాలని, మరుగుదొడ్లు నిర్మించాలని మండల అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో సీతరావమ్మ, మండలస్థాయి అధికారులతోపాటు నాయకులు మున్నూరి కిషన్, దిగంబర్‌రావు ఉన్నారు.



పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న డీజీపీ జితేందర్

తెలంగాణ పోలీసులకు
ఎవరూ సాటిలేరు

- ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా విధుల నిర్వహణ
- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్

7

పేదలకు అండగా నిలవాలన్నదే
ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు
- పంచాయతీల వద్ద లిస్టు
- గ్రామస్థులు నిర్ణయించిన వారికే పథకాల వర్తింపు
- నేరడిగుంట నుంచే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

7



నేరడిగుంటలో నిర్వహించిన గ్రామసభలో మహిళతో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోరుగా
ఓఎస్‌సీ సర్వే

- బడి బయట పిల్లల గుర్తింపు
- 6-14, 15-19 ఏళ్ల పిల్లలను వేర్వేరుగా నమోదు
- బడీడు పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యంగా విద్యాశాఖ కార్యాచరణ
- రేపటితో ముగియనున్న గడువు

7

సాన పెడితేనే బతుకు సాగేది



ఏడు పదుల వయసులోనూ కాయ కష్టం చేసి బతుకుతున్నారు ఆ వృద్ధ దంపతులు. మహారాష్ట్రకు చెందిన శివాజీ, శ్యామమ్మ పదిహేను సంవత్సరాల క్రితం బతుకు దెరువు కోసం సంగారెడ్డి మండలం ఈశ్వరాపురానికి వచ్చారు. అక్కడి బస్‌షెల్టర్‌లోనే ఉంటూ కొడవళ్లకు సాన పెడుతూ జీవనం సాగిస్తున్నారు. ఎండైనా.. వానైనా.. చలికి వణుకుతున్నా.. ఆరోగ్యం సహకరించకున్నా పని చేయాల్సిందేనని, లేదంటే పస్తులుండాల్సి వస్తుందని వాపోతున్నారు.

- సంగారెడ్డి జిల్లా ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)



ఎమ్మెల్యే 'గూడెం'కు నిరసన సెగ

5వ పేజీ తరువాయి

మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ నేతలు భగ్గుమంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లపాటు అధికారం చెలాయించి తమను ఇబ్బంది పెట్టారని, ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి మరోసారి తమ ప్రాధాన్యతను తగ్గిస్తున్నారని మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తనవెంట బీఆర్ఎస్ నేతలను తిప్పుకోవడంపై ఆగ్రహిస్తున్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరిన తర్వాత ప్రభుత్వ కార్యాక్రమాలకు హాజరైన పలు సందర్భాల్లో నిరసనలు మిన్నంటాయి. సోలక్‌పల్లిలో రుణమాఫీ సంబరాల సమయంలో ఎమ్మెల్యే ముందే బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఇటీవల ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఎమ్మెల్యేకు గోబ్యాక్ అంటూ పార్టీ శ్రేణులు తీవ్రస్థాయిలో నిరసన తెలిపారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటీలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వీటన్నింటి నేపథ్యంలో గురువారం పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు.

బదిలీల్లోనూ ఆధిపత్యం!

పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారుల బదిలీల్లోనూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధిపత్యం చూపిస్తున్నారని కాటా శ్రీనివాస్‌గౌడ్ వర్గీయులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆరోపిస్తున్నారు. గత పదేళ్లలో కాంగ్రెస్ నాయకులను ఎవరైతే ఇబ్బందులు పెట్టారో ఆ పోలీసులకే ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మళ్లీ వారికే కీలక పోస్టింగులు ఇప్పించుకోవడంపై భగ్గుమంటున్నారు. అధికారుల బదిలీల విషయంలో కాటా శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల గాంధీభవన్‌లోనూ నిరసన తెలిపారు. నిత్యం జిల్లా మంత్రి దామోదర్‌తో పాటు పార్టీలోని ఇతర పెద్దలకూ మొరపెట్టుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేలు లేనిచోట పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిల మాటనే ప్రామాణికంగా తీసుకుంటామని సీఎం, అధిష్ఠానం చెప్పినప్పటికీ పటాన్‌చెరులో పరిస్థితి మరోలా ఉందని వాపోతున్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని చేర్చుకొని పాత కాంగ్రెస్ నాయకులకు ఎలాంటి ప్రాధాన్యత లేకుండా చేశారని ఆవేదన చెందుతున్నారు.

గూడెం వ్యాఖ్యలతో కలకలం..

కాంగ్రెస్ నాయకులు తన క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టడంపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన కార్యాలయంలో కేసీఆర్ ఫొటో పెట్టుకుంటే తప్పేంటని, పదేళ్లపాటు అభివృద్ధికి సహకరించిన మాజీ సీఎం అని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించగా.. తన ఇష్టం ఉంటే పెట్టుకుంటా.. లేదంటే లేదని సమాధానమిచ్చారు. కాంగ్రెస్ కండువా వేసుకోవడం లేదని అడగడంతో.. దానితో ఏం సంబంధం.. 23 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని చెప్పుకొచ్చారు. తనపై విమర్శలు చేసినవాళ్లందరూ పరిజ్ఞానంలేని చిల్లరగాళ్లు అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను సమయం ప్రకారం పిలుస్తానని చెప్పారు. గ్రూపు రాజకీయాలు చేసే కాటా శ్రీనివాస్‌గౌడ్ దమ్ముంటే నేరుగా తలపడాలని సవాల్ విసరడం చర్చనీయాంశంగా మారింది.



సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

వంద శాతం రైల్వే లైన్ విద్యుదీకరణ

హైదరాబాద్, జనవరి23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్మించిన మనోహరాబాద్-సిద్దిపేట రైలుమార్గం మినహా హైదరాబాద్ డివిజన్‌లోని 1,004 కిలోమీటర్ల ట్రాక్ కలుపుకుని విద్యుదీకరణ 100 శాతం పూర్తయినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అక్కన్నపేట-మెదక్ రైల్వే ట్రాక్ మధ్య రూ.15.49 కోట్ల వ్యయంతో చేపట్టిన 18.56 కిలోమీటర్ల విద్యుదీకరణ పనులు పూర్తికావడంతో వినియోగంలోనికి తీసుకువచ్చినట్టు తెలిపారు. అక్కనపేట్-మెదక్ రైల్వేలైన్ మెదక్‌ను సికింద్రాబాద్-నిజామాబాద్- ఔరంగాబాద్ ఆ తర్వాత ముంబై వైపు వెళ్లే ప్రధాన రైలు మార్గంతో అనుసంధానం చేస్తుందన్నారు. రైల్వేలైన్ విద్యుదీకరణతో ట్రాక్షన్‌పవర్ మార్పు అవసరం ఉండదని, దీంతో అంతరాయం లేకుండా రైళ్ల రాకపోకలు సాగుతాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని కోచ్‌లను ప్రవేశపెట్టడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. హైదరాబాద్ డివిజన్‌లో డీజిల్ నుంచి ఎలక్ట్రిక్ ట్రాక్షన్ మార్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గ్రాస్‌టన్ కిలోమీటర్లలో విద్యుత్ ట్రాక్షన్ వాటా 2023-24లో 29.3 శాతం కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 నాటికి 81.7 శాతానికి పెరిగినట్టు అధికారులు తెలిపారు. నూతనంగా విద్యుదీకరించిన అక్కన్నపేట- మెదక్ రైల్వేలైన్ తనిఖీలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ బ్రిజ్ మోహన్ మీనా, డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ టవర్ కారును ప్రారంభించినట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు. రైల్వే లైన్ల విద్యుదీకరణతో ఇందన వ్యయాన్ని తగ్గించడంతో పాటు ఆధునిక రైల్వే వ్యవస్థను పర్యావరణహితంగా, మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం లభిస్తుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన ఖేడ్ రైతులు

నారాయణఖేడ్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అబెండా గ్రామానికి చెందిన పలువురు రైతుల బృందం 'యునైటెడ్ వే ముంబాయి' అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, పలు కమిటీల పనితీరు, మహిళా సంఘాల స్వావలంబన, గ్రామానికి లభించిన జాతీయ, అంతర్జాతీయ అవార్డులు, సేంద్రియ వ్యవసాయంలో పురోగతి గురించి జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి రైతుబృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో జగన్నాథ్, ప్రియారెడ్డి, మొబలైజర్ శివరాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆదినారాయణస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

జిన్నారం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కొడకంచి ఆదినారాయణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రామాజీరావు తెలిపారు. గురువారం ఆదినారాయణస్వామి ఆలయం వద్ద బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను చైర్మన్ రామాజీరావు, మాజీ సర్పంచులు శివరాజ్, శ్రీశైలంయాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు ఆవిష్కరించారు. ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నామని తెలలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించండి

● డీఆర్డీఏ పీడీకి వెల్మకన్నె గ్రామస్థుల ఫిర్యాదు

కౌడిపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : అవినీతికి పాల్పడ్డ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని మండలంలోని వెల్మకన్నెకు చెందిన గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసి మాట్లాడారు. కొంతకాలంగా అనేక మంది పనికి రాకపోయినా వారి పేరుతో కూలీ డబ్బు స్వాహా చేయడమే కాకుండా.. అక్రమాలకు పాల్పడుతున్నాడని ఈనెల 10న మండల సామాజిక తనిఖీలో బయటపడడంతో అధికారులు సస్పెండ్ చేశారన్నారు. అవినీతికి పాల్పడ్డ ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఎట్టి పరిస్థితుల్లో విధుల్లోకి తీసుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నవీన్‌గుప్తా, మాజీ సర్పంచ్ ప్రకాశ్, ఇన్‌చార్జి సర్పంచ్ రాజేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 7న 'లక్ష డప్పులు.. వేల గొంతుల' మహా ప్రదర్శన

● ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ

తూప్రాన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహిస్తున్న 'లక్ష డప్పులు.. వేల గొంతుల' దండోరా సాంస్కృతిక మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ కోరారు. గురువారం తూప్రాన్ పట్టణంలో జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో నిర్వహించే మహాప్రదర్శన విజయవంతం చేసేందుకు 25న సిద్దిపేట సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'రసాయన పరిశ్రమ ఏర్పాటు చేయొద్దు'

కోహీర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో రసాయన పరిశ్రమ ఏర్పాటుకు గోడలు నిర్మిస్తుండగా, గ్రామస్థులు ఆందోళన చేశారు. అనంతరం రసాయన పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని తహసీల్దార్ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అశోక్, మాజీ సర్పంచులు రాజశేఖర్, మల్లికార్జున్, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మల్లన్న దర్శనానికి వస్తూ..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● ఒకరికి గాయాలు



రోడ్డుప్రమాదంలో మృతిచెందిన సతీశ్, పక్కన గాయాలపాలైన వంశీ

చేర్యాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వస్తుండగా మండలంలోని ఐనాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకున్న రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, మరొక యువకుడు గాయాలపాలై అపస్మారకస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ మల్కాజ్‌గిరికి చెందిన ఏగుర్ల సతీశ్(36) స్విగ్గీ ఫుడ్ డెలివరీ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం తనమిత్రులతో కలిసి మొత్తం ఎనిమిది మంది నాలుగు బైక్‌లపై కొమురవెల్లి మల్లన్న దర్శనం కోసం బయలుదేరారు. మరికొద్ది నిమిషాలలో కొమురవెల్లికి చేరుకోనున్న క్రమంలో రాజీవ్‌రహదారికి సమీపంలోని ఐనాపూర్ గ్రామశివారు మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొన్నది. దీంతో ద్విచక్రవాహనంపై వెనకాల కూర్చున్న సతీశ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. డ్రైవింగ్ చేస్తున్న వంశీకి తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వంశీని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. విషయం తెలిసిన చేర్యాల సీఐ ఎల్.శ్రీను, ఎస్‌ఐ రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో కొమురవెల్లికి చేరుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లో నుంచి వెళ్లి.. చెరువులో శవమై

నర్సాపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి చెరువులో శవమై తేలిన సంఘటన మాసాయిపేట మండలం పరిధిలో చోటుచేసుకున్నది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెట్ల తిమ్మాయిపల్లికి చెందిన నర్సింహాచారి(48) తన భార్య కొన్నేళ్లుగా రావటం లేదనే మనస్తాపానికి గురయ్యాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లాడు. ఆచూకీ కోసం వెతుకుతుండగా గురువారం గ్రామ చెరువులో శవమై కనిపించినట్లు నర్సింహాచారి కుమారుడు బాలుచారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

నర్సాపూర్, జనవరి23 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాసాయిపేట మండలం పరిధిలో చోటుచేసుకున్నది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెట్ల తిమ్మాయిపల్లికి చెందిన ఊట్ల రాజు(38), భార్య హేమలతకు మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో మనస్తాపానికి గురైన రాజు బుధవారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

మూర్ఛతో పొలంలో పడి వ్యక్తి మృతి

గజ్వేల్ రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ వచ్చి బోర్లా పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బంగ్లవెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. బేగంపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లవెంకటాపూర్ గ్రామానికి చెందిన పంజాల కృష్ణస్వామిగౌడ్(36) బుధవారం సాయంత్రం తన పొలానికి మందు చల్లడానికి వెళ్లాడు. అక్కడ పొలంలో మూర్ఛతో బోర్లా పడిపోగా, రాత్రి ఎంతకి తిరిగి రాకపోవడంతో తన భార్య సరిత, కొడుకు ప్రశాంత్‌తో కలిసి పొలానికి వెళ్లి వెతికారు. పొలంలో స్వామిగౌడ్ పడి ఉండగా వెంటనే అతడిని గజ్వేల్ ప్రభుత్వం ఆసుపత్రికి తరలించగా అతడు అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. కృష్ణస్వామి తండ్రి పంజాల కుమార్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సిరిపురంలో దొంగల బీభత్సం

● గ్రామంలో నాలుగు చోట్ల చోరీ

● ఓ కిరాణా దుకాణం గోడకు కన్నమేసి దోపిడీ



సిరిపురంలో ఓ దుకాణానికి కన్నమేసిన దుండగులు

హత్నూర, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో బుధవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలోని రెండు కిరాణా దుకాణాలు, ఓ ఫర్టిలైజర్ షాపు, తాళం వేసి ఉన్న ఇంట్లో దోచుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని గుర్తుతెలియని వ్యక్తులు కిరాణా దుకాణం గోడకు కన్నమేసి చోరీకి పాల్పడ్డారు. అదే గ్రామానికి చెందిన మరో దుకాణంలో, ఓ ఫర్టిలైజర్ షాపులోనూ చోరీ జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. గ్రామంలోని ఓ కిరాణా దుకాణం గోడకు గుర్తుతెలియని వ్యక్తులు కన్నమేసి లోపలికి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఇదే గ్రామంలోని కోమటి యాదగిరి కిరాణా దుకాణంలోనూ సామగ్రిని ఎత్తుకెళ్లారు. అదేవిధంగా గ్రామంలోని విఠల్‌రెడ్డికి చెందిన ఫర్టిలైజర్ దుకాణంలో చొరబడి అందులోని కొంత నగదుతో పాటు డబ్బు లెక్క పెట్టే మిషన్‌ను దొంగిలించారు. గ్రామానికి చెందిన దమ్మగారి భాగ్యమ్మ ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో కలిసి విహారయాత్రకు వెళ్లింది. ఆ ఇంటి వెంటిలేటర్‌ను తొలగించి దుండగులు వస్తువులను చిందరవందరగా పడవేశారు. ఆ సమయంలో ఇంట్లో విలువైనవి ఏమి లేకపోవడంతో ఆ ఇంట్లో పెద్దగా చోరీకి జరగలేదు. నెలక్రితమే గ్రామంలోని ఓ బంగారం దుకాణానికి కన్నం కొట్టి చోరీకి యత్నించినట్లు గ్రామస్థులు తెలిపారు. మరోసారి దొంగల బీభత్సంతో భయాందోళనకు గురవుతున్నారు. దుకాణ యాజమానుల ఫిర్యాదు మేరకు హత్నూర పోలీసులు చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు.

స్క్రాప్ గోదాంలో భారీ మంటలు



స్క్రాప్ గోదాంలో చెలరేగిన మంటలతో కమ్ముకున్న పొగ

నర్సాపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న ఓ స్క్రాప్ గోదాంలో గురువారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న కొందరు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వారు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. రెండు ఫైర్ ఇంజన్లు అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశాయి. దీంతో సమీపంలోని ఇళ్ల వారు ఊపిరిపీల్చుకున్నారు. ఘటనా స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, స్థానిక నాయకులు దావుద్ తదితరులు పరిశీలించారు.

పేదలకు అండగా నిలవాలన్నదే

ప్రజా ప్రభుత్వ ధ్యేయం

● పారదర్శకంగా పథకాల అమలు

● గ్రామ పంచాయతీ బోర్డుపై అర్హుల లిస్టు

● గ్రామస్థులు నిర్ణయించిన వారికే పథకాల వర్తింపు

● నేరడిగుంట నుంచే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం

● రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, జనవరి23 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ పేదవానికి అండగా నిలవాలన్నదే రేవంత్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం ఆయన అందోలు మండలంలోని నేరడిగుంటలో నిర్వహించిన గ్రామసభలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తాము ప్రవేశపెట్టిన ప్రతీ పథకం అనర్హులకు కాకుండా నిజమైన అర్హులకే దక్కాలన్నది తమ అభిమతమన్నారు. ఇందు కోసం ప్రతీ పథకాన్నీ పారదర్శకంగా అమలు చేయాలని నిర్ణయించామన్నారు. తద్వారా అనర్హులకు పథకాలు రాకుండా నివారించొచ్చన్నారు. పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి జాబితాను ఆయా గ్రామ పంచాయతీలోని నోటీసు బోర్డుపై ఉంచాలని ఆదేశించారు. బోర్డుపై ఉన్న పేర్లలో అసలైన అర్హులను గుర్తించే బాధ్యత గ్రామస్థులదేనని, వారి నిర్ణయం మేరకే లబ్ధిదారుల లిస్టు ఫైనల్ చేసి, వారికే పథకాలను వర్తింపజేయాలని అధికారులను ఆదేశించారు.

పక్షం రోజుల్లో ఇళ్లకు శంకుస్థాపన

ఆరు గ్యారెంటీల్లో భాగమైన.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మరో పక్షం రోజుల్లో ప్రారంభిస్తామని మంత్రి దామోదర్ తెలిపారు. నేరడిగుంట నుంచే ఈ పథకాన్ని ప్రారంభిస్తానని, అంచెలంచెలుగా ప్రతీ గ్రామానికీ విస్తరిస్తామన్నారు. ఇళ్లు లేని వారికి కూడా స్థలాన్ని ప్రభుత్వమే ఇస్తుందని మంత్రి భరోసానిచ్చారు. మొదటగా స్థలం లేని వారిని గుర్తించి, ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూమిని సేకరిస్తామని, ప్రభుత్వ భూమి



నేరడిగుంట గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

అందుబాటులో లేకుంటే, కొనుగోలు చేసైనా... నిరు పేదలకు ఇళ్ల స్థలాలను ఇస్తామన్నారు. స్థలాలు ఇచ్చిన తర్వాత, వారికి ఇళ్లను కూడా మంజూరు చేస్తామని హామీనిచ్చారు.

నేరడిగుంటకు వరాల జల్లు

నేరడిగుంట గ్రామంపై మంత్రి దామోదర్ వరాల జల్లు కురిపించారు. గ్రామానికి పీహెచ్‌సీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నేరడిగుంట-మక్త గూడెం-బ్రాహ్మణపల్లి రోడ్డు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గతంలో తాను మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారనే సదుద్దేశంతో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించానని, ఇప్పటికీ నిరుపయోగంగా ఉన్నదని తన దృష్టికి వచ్చిందన్నారు. స్థలాలు లేని పేదలకు ఆ భూమిని ఇద్దామనుకుంటున్నానని మంత్రి తెలిపారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలను గుర్తించి, వారికి సరిపడా ప్లాట్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నేరడిగుంట గ్రామంలో ఇంకా 27 మందికి రుణమాఫీ జరగలేదని మంత్రి దామోదర్ తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాలతో రుణమాఫీ జరగలేదని, త్వరలోనే వారికి కూడా చేయిస్తానని మంత్రి హామీనిచ్చారు. గ్రామస్థుల ఆరోగ్యం కోసం నేరడిగుంటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి ప్రకటించారు. ఇందు కోసం గ్రామంలో అనువైన స్థలాన్ని మంత్రి పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ క్రాంతి వల్లూరి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో పాండు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కడారి జోగిరెడ్డి, నాయకులు రాజిరెడ్డి, శివరాజ్ యాదవ్, మల్లప్ప, గాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌటకూర్ మండల ప్రభుత్వ కార్యాలయాలకు 6.26 ఎకరాలు

● ఫిబ్రవరిలో భవన నిర్మాణానికి శంకుస్థాపన

● సుల్తాన్‌పూర్ వద్ద స్థలాన్ని పరిశీలించిన మంత్రి

పుల్‌కల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలానికి సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన 6.26 ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ తెలిపారు. గురువారం మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులోని 44 సర్వే నంబరులో స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చౌటకూర్‌లో ఎంపీడీవో, తహసీల్దార్, వ్యవసాయశాఖ, ఎంఈవో కార్యాలయాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సరిపోను స్థలం అక్కడ అందుబాటులో లేకపోవడంతో సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో పోలీస్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా గాంధీ పాఠశాలను నిర్మించనున్నట్లు ఆయన వెల్లడించారు. పోలీస్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాలకు ఎకరం చొప్పున, కస్తూర్బా గాంధీ పాఠశాల నిర్మాణానికి 4.26 ఎకరాలు భూమిని కేటాయించామన్నారు. ఫిబ్రవరిలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభిస్తామన్నారు. మంత్రి వెంట అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్‌ఐ క్రాంతికుమార్ పాటిల్, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

తెలంగాణ పోలీసులకు ఎవరూ సాటిలేరు

● ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు

● సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్

మెదక్ అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ పోలీసులు క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన వారని, శాంతిభద్రతల కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, తెలంగాణ పోలీసులు ఎవరూ సాటిలేరని రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. గురువారం మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో కవాతు ప్రాంగణం, సెల్యూట్ బేస్‌ను ఆవిష్కరించడానికి విచ్చేసిన డీజీపీకి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం సెల్యూట్ బేస్ శిలాఫలకాన్ని డీజీపీ ఆవిష్కరించారు. పోలీసు కవాతులో పాల్గొన్న డీజీపీ గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ పోలీసులు పనిచేస్తున్నారన్నారు. అమీన్‌పూర్, రాయపోల్, చేగుంట, నార్సింగి మండల కేంద్రాల్లో కొత్త భవనాలతోపాటు కొత్త మండల



సెల్యూట్ బేస్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర డీజీపీ జితేందర్ తదితరులు

కేంద్రాల్లో పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. అర్బన్ ఏరియాల్లో అయితే పోలీసులు పది నిమిషాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 15 నిమిషాల్లో చేరుకుంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డయల్ 100 సేవలందించేందుకు 2000 వాహనాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ క్రైం కేసులలో రూ.180 కోట్లు రికవరీ చేశామని తెలిపారు. అదికాకుండా రూ.300 కోట్లు వేరే అకౌంట్లలోకి వెళ్లకుండా అడ్డుకున్నామన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ 24 గంటల పాటు సేవలందిస్తుందని డీజీపీ పేర్కొన్నారు.

ఎక్కువగా సాంకేతికతపైనే ఆధారపడొద్దు

ఎక్కువగా శాస్త్ర సాంకేతికపైనే ఆధారపడకుండా మానవ మేధస్సును ఉపయోగించాలని రాష్ట్ర డీజీపీ డా.జితేందర్ పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ వాహనాల అధిక స్పీడ్‌ను నియంత్రించడానికి బోలార్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదకరమైన రోడ్డు ప్రదేశాలలో రేడియంతో తయారు చేసిన సూచికలను రాత్రి వేళల్లో సైతం స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. దొంగతనాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో బీట్ నిర్వహణ, పెట్రోలింగ్ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజు వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. వీపీవో ప్రతి గ్రామాన్ని విజిట్ చేయాలని ఆదేశించారు. సీసీ కెమెరాల పనితీరును ఎల్లప్పుడూ పర్యవేక్షించాలన్నారు. అనంతరం జిల్లా పరిస్థితులపై చర్చించారు. ఈ సమావేశంలో మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, వెంకట్‌రెడ్డి, ఏఆర్‌డీఎస్పీ రంగనాయక్, సైబర్‌క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

24 గంటల రక్షకులు పోలీసులు : ఎంపీ రఘునందన్‌రావు

ప్రజలకు, నాయకులకు 24 గంటలు రక్షణ కల్పించే రక్షకులు పోలీసులని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. కష్టపడి పనిచేసే పోలీసులకు కొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. యూనిఫాం సర్వీస్‌లో ఉండి సమస్యలు చెప్పుకోలేక భయపడుతున్నారన్నారు. టీఏ, డీఎల్ కూడా రావడం లేదని, దీన్ని మొదటి ప్రాధాన్యతగా చూడాలని డీజీపీని కోరారు. ఉమ్మడి మెదక్ జిల్లాల్లో కొన్ని పోలీస్‌స్టేషన్ భవనాలు చాలా పెండింగ్‌లో ఉన్నాయని, కొత్త స్టేషన్లు కావాలన్నారు. అదేవిధంగా మాసాయిపేట, నార్సింగి, హావేలీఘనపూర్ మండలాల్లో కొత్తస్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో ఒకే పోలీసుస్టేషన్ ఉందని, ట్రాఫిక్, మహిళా, టూటౌన్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. అమీన్‌పూర్‌కు ఎకరం స్థలం కూడా కేటాయించారని, స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. రాయపోల్ స్టేషన్ అద్దె భవనంలో నడుస్తుందని, కొన్ని ప్రాంతాల్లో సీసీ టీవీలు పని చేయడం లేదని సమస్యలను డీజీపీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

బడి బయట పిల్లల గుర్తింపు

● విద్యాశాఖ ఆధ్వర్యంలో ఓఎస్‌సీ సర్వే

● రేపటితో గడువు ముగింపు

● 6-14, 15-19 ఏళ్ల పిల్లలను వేర్వేరుగా గుర్తింపు

● బడీడు పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యం

సంగారెడ్డి అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : చదువుకునే వయసులో ఆర్థిక స్తోమత, కుటుంబ పరిస్థితులు, బాల కార్మికులు, వెట్టిచాకిరి, కార్ఖానాలో పనిచేయడం, ఇతర సమస్యలతో పలువురు బడికి వెళ్లడం లేదు. మరికొందరు ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయ కూలీ పనులకు వెళుతుంటారు. ఇంకొందరు కులవృత్తిలో కొనసాగుతూ విద్యకు దూరమవుతున్నారు. ఫలితంగా ఉన్నత విద్యనభ్యసించాలంటే వారి ఆశయం నెరవేరడం లేదు. ఇలాంటి వారిని గుర్తించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. బడీడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే విధంగా బడి బయటి పిల్లల గుర్తింపు పేరిట (ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్-ఓఎస్‌సీ)సర్వేను చేపట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది. బడి మధ్యలో మానేస్తున్న పిల్లలను గుర్తించేందుకు సమగ్ర శిక్షా అభియాన్ పరిధిలోని క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ)లు ఇంటింటా సర్వే కోసం తిరుగుతున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం మొన్నటివరకు సమ్మెలో ఉన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు సర్వే బాట పట్టారు.

25 వరకు సర్వే గడువు

బడీడు పిల్లల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా పాఠశాలలకు రాని బడీడు పిల్లల లెక్కను తేల్చేందుకు విద్యాశాఖ చర్యలకు ఉపక్రమించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలబాలికల విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ చాలా మంది బడికి దూరంగానే ఉంటున్నారు. ఎన్ని సర్వేలు చేసినా.. పిల్లలు చదువుకోవాలని అధికారులు పదేపదే చెబుతున్నా, కొందరి బాల్యం మాత్రం బడి బయటే మగ్గుతున్నది. కొందరు బడికి వచ్చి మధ్యలో ఆగిపోయిన వారు ఉంటున్నారు. దీంతో బడి బయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు పాఠశాల విద్యాశాఖ ఈ నెల 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు సర్వే చేయాలని ఆదేశించింది. ప్రతీ ఏడాది విద్యాశాఖ రెండు సార్లు సర్వే నిర్వహిస్తున్నది. ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ పేరిట నిర్వహించే సర్వే ద్వారా 6-14 ఏళ్లలోపు బడీడు పిల్లలను, అదే విధంగా కళాశాల స్థాయిలో 15-19 ఏళ్ల పిల్లలను వేర్వేరుగా గుర్తించి జాబితా రూపొందించనున్నారు. విద్యార్థి సామర్థ్యం, వయసు ప్రకారం వీరి అర్హత ఆసక్తిని బట్టి తగిన తరగతిలో చేర్పించటం, దూర విద్యలో ప్రవేశాలు కల్పించేలా అధికారులు కృషి చేయనున్నారు. విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్ష కింద పనిచేసే సీఆర్పీలు క్షేత్రస్థాయిలో వెళ్లి ఈ సర్వే చేయనున్నారు. ఉన్నత చదువుల ఎందుకు నిలిపేశారనే అంశాలు, పరిస్థితులపై ఆరా తీసి సమాచారాన్ని నమోదు చేస్తారు. ఈ నెల 25 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటికి తిరుగుతూ సర్వే పూర్తి చేయాలని సీఆర్పీలు, ఐఈఆర్‌పీ, డీఎల్ఎంటీలను విద్యా శాఖ అధికారులు వారికి ఆదేశాలు జారీ చేశారు.



బడి బయటి పిల్లల సర్వే చేస్తున్న సీఆర్పీ, ఉపాధ్యాయులు (ఫైల్)

ప్రబంద్ పోర్టల్‌లో వివరాల నమోదు

ముఖ్యంగా ఆవాస ప్రాంతాలు, గృహాలు, పనిప్రదేశాలను సందర్శించి ఆరా తీసి వివరాలు సంబంధిత ప్రొఫార్మాలో నమోదు చేయాల్సి ఉంటుంది. తదనంతరం జాతీయ స్థాయిలో రూపొందించిన ప్రబంద్ పోర్టల్‌లో గుర్తించిన బడి బయటి పిల్లల వివరాలు అప్‌లోడ్ చేస్తారు. వారిని వచ్చే విద్యా సంవత్సరం నుంచి బడికి వచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఆసక్తి ఉన్న వారిని వృత్తి విద్యా కోర్సుల్లో చేర్పించనున్నారు. ఉన్నత విద్య ఫలాలు అందించి జీవితంలో స్థిరపడేలా చేయూతనివ్వనున్నారు. సర్వేను విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తారు. ఇలా ఉండగా గత నెల సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె కారణంగా సర్వే చేయలేదని, అందుకే తాజాగా విద్యాశాఖ సర్వే చేయాలని ఆదేశించడంతో శనివారంలోగా సర్వే పూర్తికి ఆదేశాలు జారీ చేశామని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

38వ జాతీయ క్రీడా పోటీలకు

సాంకేతిక అధికారిగా తోట సతీష్ నియామకం

సిద్దిపేట కల్చరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 38వ జాతీయ క్రీడా పోటీలకు సాంకేతిక అధికారిగా ప్రముఖ యోగా గురువు, ఫిజికల్ డైరెక్టర్ తోట సతీష్ ఎంపికయ్యారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 4వరకు ఉత్తరాఖండ్‌లోని అల్మోర పట్టణంలో పోటీలు జరగనున్నాయి. గతంలో కూడా పలు ప్రతిష్టాత్మక పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా సతీష్ సేవలందించారు. జాతీయ బెస్ట్ టెక్నికల్ అఫీషియల్ అవార్డును కూడా ఆయన సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలదేవి సతీష్‌కు అభినందనలు తెలిపారు.



సతీష్‌కు అభినందనలు తెలియజేస్తున్న సోనీ బాలదేవి

ఆట పాటలతో మహాసభలను ముందుకు తీసుకువెళ్లాలి

● ప్రజా సమస్యలపై ఉద్యమించింది ఎర్రజెండాయే

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య



కళాకారుల ప్రదర్శన

సంగారెడ్డి రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆటపాటలతో రాష్ట్ర మహాసభలను ముందుకు తీసుకువెళ్లాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. సంగారెడ్డిలో ఈ నెల 25వ తేదీ నుంచి 28వ వరకు నిర్వహించే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభల్లో భాగంగా గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ప్రజా సాంస్కృతికోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్.వీరయ్య మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని చూశామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూస్తున్నామని.. ఆ రెండు పార్టీలు ప్రజా సమస్యలను గాలికి వదిలేశాయని విమర్శించారు. ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమించింది ఎర్రజెండాయేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యంగా ఎండగట్టాల్సిన అవసరమున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే సీపీఎం పార్టీ బలోపేతమైనప్పుడే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు వేముల ఆనంద్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్, పాలడుగు భాస్కర్, ఆంధ్ర ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు సురేష్, వెంకన్న, వినోద్, నర్సారెడ్డి, అంజన్న, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పటాన్‌చెరు/రామచంద్రాపురం టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో నేడు సరఫరా ఉండదని ఏఈ వెంకట్‌రాంరెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ గ్రామం, చక్రపురి, రాజరాజేశ్వరి తదితర కాలనీలోంల స్వల్ప సమయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. రోడ్డు విస్తరణ పురస్కరించుకుని విద్యుత్ లైన్లను తరలించేందుకు మధ్యాహ్నం 1 నుంచి 4 వరకు మున్సిపల్ పరిధిలోని బందంకొమ్ము, వీరారెడ్డి కాలనీ, భవాణిపురం కాలనీల సరిసరాల్లో, పటాన్‌చెరు మండల పరిధిలోని ఐనోల్, కిష్టారెడ్డిపేట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఇంద్రేశం, కంజర్ల, ఐనోల్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నర్రెగూడెం, కిష్టారెడ్డిపేట పరిధిలో పలు కాలనీల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం వరకు స్వల్ప సమయం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ పేర్కొన్నారు. అలాగే అశోక్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11 నుంచి 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నామని ఏఈ తిరుపతమ్మ చెప్పారు. రామచంద్రాపురం, శ్రీనివాస్‌నగర్ కాలనీ, దర్గాగార్డెన్ ఏరియా, సండే మార్కెట్, సంగీతా సినిమాహాల్ ప్రాంతం, ఐదుగుళ్లపోచమ్మ ఆలయ సమీపంలో, బోంబేకాలనీ, ఈఎస్‌ఐ ఆసుపత్రి ప్రాంతం, రామచంద్రారెడ్డినగర్ కాలనీ, నాగుళ్లమ్మ ఆలయ పరిసరాల్లో, స్నేహలేక్‌వ్యూ అపార్ట్‌మెంట్లు, జీహెచ్ఎంసీ కార్యాలయం ప్రాంతం, బీడీఎల్ క్వార్టర్స్, హెచ్ఐజీ, ఎల్ఐజీ కాలనీల్లో, ఎంఆర్ఎఫ్, మ్యాక్ సొసైటీ కాలనీతో పాటు రామచద్రారపురం పరిశ్రమల ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుదని చెప్పారు.

మంచినీటి ఎద్దడికి ప్రత్యేక చర్యలు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- అమీన్‌పూర్‌లో రూ.6.82 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



అమీన్‌పూర్‌లో మినీ మంచినీటి రిజర్వాయర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వేగంగా విస్తరిస్తున్న అమీన్‌పూర్ మున్సిపాలిటీలో శాశ్వత మంచినీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలో రూ.6.82 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. పట్టణంలోని లాలాబాయి కాలనీలో నిర్మించిన మినీ రిజర్వాయర్ నుంచి మంచినీటిని విడుదల చేశారు. వేగంగా విస్తరిస్తున్న జనావాసాలకు నిరంతరం మంచినీటి సరఫరా చేయాలన్న లక్ష్యంతోనే భారీ రిజర్వాయర్లను నిర్మించామన్నారు. ఒకప్పుడు నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే మున్సిపాలిటీలలో సమస్య శాశ్వతంగా సమసిపోయిందన్నారు. కొత్తగా వస్తున్న కాలనీలకు తాగునీటికి ఎలాంటి డోకాలేదన్నారు. ఐదేళ్లుగా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేస మౌలిక వసతులను కల్పించారన్నారు. రికార్డుస్థాయిలో అభివృద్ధి పనులు జరిగినందుకు సంతృప్తిగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారంనర్సింహగౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, మెట్రోవాటర్ వర్క్స్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో నిరుపేదలకు ప్రయోజనం



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్/ఝరాసంగం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధితో నిరుపేదలకు ప్రయోజనం చేకూరుతుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 13 మంది అబ్ధిదారులకు రూ.3.55 లక్షల విలువచేసే చెక్కులను అందజేసి మాట్లాడారు. అందులో భాగంగా ఝరాసంగం మండలంలోని వనంపల్లి, క్రిష్ణాపూర్, నర్సాపూర్, జీర్లపల్లి, ప్యారవరం, ఎల్గొయి, చీలమామిడి, తుమ్మన్‌పల్లి, జీర్లపల్లి, ఝరాసంగంకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఝరాసంగం మండలంలోని మాచ్నూర్ గ్రామంలో గల ప్రభుత్వభూమి కబ్జాకు గురికాకుండా చూడాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు తహసీల్దార్ తిరుమలరావును ఆదేశించారు. గురువారం ఝరాసంగంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమ పథకాలు

- డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

మెదక్/చేగుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అమలుచేయని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరుగ్యారంటీ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి పథకాలను అందించేందుకు గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించడం జరిగిందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, రేషన్‌కార్డులు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అర్హులందరికీ న్యాయం జరుగుతుందని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వడియారంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు చిరస్మరణీయం



పెద్దశంకరంపేటలో చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



సంగారెడ్డి నేతాజీనగర్‌లోని చంద్రబోస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట/సంగారెడ్డిఅర్బన్/సంగారెడ్డి రూరల్/తూప్రాన్/మనోహరాబాద్/గుమ్మడిదల/చేగుంట/కంగ్టి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సంగ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు చిరస్మరణీయమని విశ్వహిందూ పరిషత్ సహ సంపర్క్ ప్రముఖ్ రాంరెడ్డి అన్నారు. నేతాజీ జయంతిని పురస్కరించుకొని పెద్దశంకరంపేటలోని ఆయన విగ్రహానికి ఆర్‌వీఎస్ స్వచ్ఛంద సంస్థ, శ్రీసరస్వతీ శిశుమందిర్, ఆర్ఎస్ఎస్ బాధ్యులు పూలమాలలు వేశారు. సంగారెడ్డిలో బీజేపీ ఆధ్వర్యంలో, సంగారెడ్డిలో ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి ప్రతినిధులు, తూప్రాన్‌లో సూర్యచంద్ర ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పసుల నారాయణ ఆధ్వర్యంలో, మనోహరాబాద్ మండలంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో, గుమ్మడిల మండలంలో యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో, చేగుంట మండలంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. మండల కేంద్రమైన కంగ్టితో పాటు వివిధ గ్రామాల్లో నేతాజీ జయంతి నిర్వహించారు.

ఎన్నికల కోసమే గ్రామసభలు



మాట్లాడుతున్న సంజీవయ్య, కాశపాగ ఇమ్మయ్య

పుల్‌కల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తున్నదని జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత పల్లె సంజీవయ్య ఆరోపించారు. చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య, మరో నాయకుడు ఎర్రోల్ల పోచయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు, సహాయం అందడం లేదని మండిపడ్డారు. ప్రజాపాలన, కులగణన, గ్రామసభలు అంటూ ప్రభుత్వం ప్రజలను నాటకాలడిస్తుందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

సంగారెడ్డి క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ సూచించారు. సంగారెడ్డి పట్టణ శివారులోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో గురువారం వివిధ పాఠశాలల విద్యార్థులకు డ్రగ్స్, ట్రాఫిక్ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ అంతా నాశనం చేసుకున్న వారవుతారని అన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిన్యాబ్ డీఎస్పీ పుష్పన్‌కుమార్, సంగారెడ్డి రూరలల్ సీఐ క్రాంతికుమార్, ట్రాఫిక్ సీఐ సుమన్, ఎస్ఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా మోడీ పాలన



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్/గుమ్మడిదల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రధాని మోదీ పాలన సాగుతుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో సంవిధాన్ గౌరవ్‌లో భాగంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, అసెంబ్లీ కన్వీనర్ రమణారావు, కౌన్సిలర్ బుచ్చేస్ యాదవ్ కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి, కాలనీ వాసులతో మాట్లాడారు. గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామపంచాయతీ ఆవరణలోని దళితవాడలో బీజేపీ మండల అధ్యక్షుడు కావలి ఐలయ్య ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు, సీనియర్ మండల నాయకుడు ముత్యాలుగౌడ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఎమ్మెల్యే తనిఖీ

నారాయణఖేడ్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంత్‌సాగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల సంఖ్య, వారికి అందిస్తున్న పౌష్టికాహారం, వసతులు, విద్యాబోధన, తదితర వివరాలను అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. పిల్లల హాజరు రిజిష్టర్ స్టాక్ రిజిష్ట్రర్లను పరిశీలించారు. అనంతరం ఆయన చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించడమే కాకుండా ఆటపాటల ద్వారా విద్యాబోధన చేయాలని సూచించారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

రామచంద్రాపురం టౌన్ జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు అన్నిరకాలుగా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం రామచంద్రాపురం గీతాభూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న నిర్మాణ పనులు పరిశీలించారు. రానున్న గణతంత్ర దినోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆదర్శరెడ్డి, కుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్, జగన్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత కోసమే గ్రామసభలు



ఖేడ్ మండలం అనంత్‌సాగర్‌లో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నాగ్‌సాన్‌పల్లిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్ మండలం అనంత్‌సాగర్, కల్హేర్ మండలం బాచేపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని జీర్లపల్లి, ఏడాకులపల్లి, మెదపల్లి, గినియార్‌పల్లిలో గ్రామసభలను ఏర్పాటు చేశారు. ఝరాసంగంలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొన్నారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట, గౌడిచర్ల, హనుమాన్‌నగర్, గుడితండా గ్రామసభల్లో ఎంపీడీవో యాదగిరిరెడ్డి, ప్రత్యేకాధికారి ఖాసీంబేగ్, జోగిపేట మున్సిపల్ పరిధి 3వ వార్డులోని మార్కెట్‌యార్డు, పుల్కల్ మండలం హన్మ్యానాయక్‌తండా, మిన్‌పూర్‌తండా, పెద్దారెడ్డిపేట, పోసానిపల్లి, చక్రియాల, ముదిమాణిక్యం, గంగోజిపేట, గొంగ్లూరు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో ఎంపీవో ఆర్.శ్రీకాంత్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు చిన్నరోళ్లపాటి రాజశేఖర్, జిన్నారం మండలం జిన్నారం, మాధారం, నాగల్‌గిద్ద మండలం మావినెల్లి, దామర్‌గిద్ద, మనూరు మండలం, పుల్‌కూర్తి, కోహీర్ మండలం బడంపేట, గొటిగర్‌పల్లి, కావేలి, పీచేర్యాగడితండా, సిద్ధపూర్ తండా, వెంకటాపూర్, జహీరాబాద్ మండలం శేఖాపూర్ తండా, మెదక్ పట్టణంలోని 19వ వార్డులో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పాల్గొన్నారు. కౌడిపల్లి మండలం నాగ్‌సాన్‌పల్లి, నర్సాపూర్‌లోని తన స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడారు. చిన్నశంకరంపేట మండలం చందంపేట, ఎస్‌కొండాపూర్, కామారంతండాలో ఎంపీడీవో దామోదర్, రామాయంపేట ధర్మారంలో, మెదక్ మండలం మక్తభూపతిపూర్, చిట్యాల, మాచావరం, గుట్టకిందపల్లి, ఖాజీపల్లి, మంబోజిపల్లి, పేరూర్, రాజ్‌పల్లి, వెంకటపూర్, నిజాంపేట మండలం చల్మెడ, నిజాంపేట, కల్వకుంట, నందిగామ, చేగుంట మండలం అన్నతసాగర్, బికొండాపూర్, చందాయిపేట్, చేగుంట, మక్కరాజిపేట్, పెద్దశివనూర్, పోలంపల్లి, మనోహరాబాద్ మండలం కూచారం, వెల్దుర్తిలో, రాయికోడ్‌లో నిర్వహించిన గ్రామసభలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

జాబ్‌మేళాతో నిరుద్యోగ యువతకు ప్రయోజనం



మాట్లాడుతున్న మహ్మద్ తన్వీర్

జహీరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జాబ్‌మేళాతో నిరుద్యోగ యువతకు ప్రయోజనం చేకూరనున్నదని మాజీ టీఎస్ఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీమంత్రి, దివంగతనేత మహ్మద్ ఫరీదుద్దీన్ జ్ఞాపకార్థం జాబ్‌మేళాను నిర్వహించామన్నారు. జహీరాబాద్‌లోని వివిధ కర్మాగారాలు జాబ్‌మేళాలో పాల్గొన్నాయి. ఇందులో సుమారు 600 మందిని ఉద్యోగ నిమిత్తం ఎంపిక చేసుకున్నారన్నారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్

నారాయణఖేడ్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సర్పంచ్, వార్డుసభ్యుల పదవులకు నామినేషన్లు వేశారు. 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాముఖ్యతను తెలియజేసేందుకే కార్యక్రమం నిర్వహించారు.

హ్యాపీ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు



విద్యార్థుల దంతాలకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శిల్పముదిరాజ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కల్వకుంటలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో హ్యాపీ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు గురువారం నిర్వహించారు. గర్ల్ చైల్డ్ డే కార్యక్రమంలో భాగంగా డా.శిల్పముదిరాజ్ సమక్షంలో స్కూల్‌లోని 289 మంది విద్యార్థినులకు దంత పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు, టూత్‌బ్రష్‌లు, మౌత్‌వాష్‌లు పంపిణీ చేశారు.

ఘనంగా వెల్‌నెస్ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం



చికిత్స పొందిన పేషెంట్లను సన్మానిస్తున్న హాస్పిటల్ యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తా సమీపంలోని వెల్‌నెస్ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏడాదికాలం పాటు హాస్పిటల్‌లో సర్జరీ చేసుకొని కోలుకున్న పేషెంట్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. హాస్పిటల్ ఎండీలు లాలేష్, వెంకటేశ్‌లు మాట్లాడుతూ ఆరోగ్య క్షేమమే ఆస్పత్రి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ వెంకటరెడ్డి, జీఎం లోకేష్, మార్కెటింగ్ మేనేజర్ శివరామకృష్ణ, హెచ్.ఆర్. డేవిడ్, డా.జహీర్, హర్షవర్ధన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జీజేహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఆంజనేయులుగౌడ్



ఆంజనేయులుగౌడ్, శేఖర్‌గౌడ్

సంగారెడ్డి రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గౌడజన హక్కుల పోరాట సమితి (జీజేహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడిగా కోనాపురం అంజనేయులుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంతగిరి శేఖర్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పదేళ్లుగా జిల్లాలో గౌడ కులస్తుల సమస్యలను పరిష్కరిస్తూ సంఘాన్ని బలోపేతం చేస్తున్నందున బాధ్యతలు అప్పగించామన్నారు.

జాతీయ రోడ్డు విస్తరణకు సహకరించాలి



జాతీయ రహదారి విస్తరణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్ జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున ప్రజలు సహకరించాలని కార్పొరేటర్ పుష్పా నగేష్‌యాదవ్ కోరారు. గురువారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలో జరుగుతున్న పనులను హైవే అథారిటీ విభాగం డీఈ రామకృష్ణ, ఏఈ శ్రీకాంత్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం వార్డు కమిటీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డుకు ఆనుకొని 30 అడుగుల సర్వీస్‌రోడ్డుతో పాటు ఫుట్‌పాత్ కూడా వస్తుందని చెప్పారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మెదక్/వెల్దుర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్, కొర్విపల్లి, మడూర్, శాలిపేట, శంకాపూర్ గ్రామాలను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో కలిసి పర్యటించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ తాళ్ల పాండరిగౌడ్ భార్య భారతిబాయి అనారోగ్యంతో మృతిచెందారు. పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మృతిచెండంతో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు రంగారావు, రాజీరెడ్డి, ఆయా గ్రామాల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అలాగే వెల్దుర్తి మండల పరిధిలోని మంగళపర్తి మాజీ సర్పంచ్ శ్రీనివాసరావ్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హన్మంతరావు, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

'ఆదరిస్తే నిరుద్యోగులకు అండగా ఉంటా'

రామయంపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : తనను ఆదరించి మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపిస్తే నిరుద్యోగులకు అండగా నిలుస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల స్థానం నుంచి పోటీ పడనున్న ఆయన గురువారం రామయంపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, విద్యావంతులను కలిశారు. తనకు అవకాశం కల్పించాల్సిందిగా నరేందర్ రెడ్డి అభ్యర్థించారు.


ఆదమరిస్తే అంతే..



అంతర్గాంతండాకు వెళ్లే రహదారి మధ్యలో ఏర్పడిన గొయ్యి

కల్హేర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం గ్రామం నుంచి అంతర్గాంతండాకు వెళ్లే బీటీ రహదారిపై గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఖేడ్ మాజీ సమితి అధ్యక్షుడి మృతి



అప్పారావు(ఫైల్)

నారాయణఖేడ్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పంచాయతీ సమితి మాజీ అధ్యక్షుడు శంశిల్లాపూర్ అప్పారావు(90) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. శంశిల్లాపూర్ అప్పారావు, దివంగత ఖేడ్ మాజీ ఎమ్మెల్యే వెంకట్‌రెడ్డి అనుచరుడు. అప్పారావు 974లో నారాయణఖేడ్ సమితి అధ్యక్షుడిగా పనిచేయడమే కాకుండా 1978లో ఖేడ్ ఎమ్మెల్యేగా పోటీచేసి 500 ఓట్ల తేడాలో ఓటమి చెందాడు. ఆయన మహారాష్ట్రలో సీఐగా విధులు నిర్వహించిన అనంతరం న్యాయవాదిగా కూడా పనిచేశారు. హట్కార్ సమాజ్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన గురువారం మృతిచెందడంతో స్వగ్రామమైన న్యాల్‌కల్ మండలం శంశిల్లాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అప్పారావు అంత్యక్రియల్లో ఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, ఖేడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మారుతిరెడ్డి, ఖేడ్ మాజీ సర్పంచ్ ముత్యాల కిష్టయ్య, న్యాల్‌కల్ మాజీ జడ్పీటీసీ చంద్రప్ప పాల్గొని నివాళులర్పించారు.